క్లుప్తంగా

పెడన నియోజకవర్గంలో 1,67,474 మంది ఓటర్లు

పెడన: పెడన నియోజకవర్గంలో 1,67,474 మంది ఓటర్లు ఉన్నారని ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో పురుషులు 82,923 మంది, మహిళలు 84,551 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇతరులు లేరని తెలిపారు. ఆయా మండలాల వారిగా పరిశీలిస్తే పెడన పట్టణంలో మొత్తం 25,265 మంది ఉన్నారన్నారు. అలాగే మండలంలో 27,874 మంది ఉన్నారు. గూడూరు మండలంలో 39,808 మంది, బంటుమిల్లి మండలంలో 36,558 మంది, కృత్తివెన్ను మండలంలో 37,969 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



కోనేరుసెంటర్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ పాండురంగారావు కోరారు. ఇటీవల బందరుకోటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వాసాల శ్రీనివాసరావు కుటుంబానికి చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న వారికి చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఎన్నో విధాలుగా సహాయ పడుతుందన్నారు. మిగిలిన స్వచ్ఛంద సంస్థలు ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు జగన్మోహన్‌రావు, ఐజాగ్, ట్రస్ట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట బోదెలోకి దూసుకెళ్లిన బైక్

కోనేరుసెంటర్: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బందరు మండలం చిట్టిపాలెం గ్రామానికి చెందిన చండిక సామ్రాజ్యం, అమ్మిరెడ్డి ప్రసన్నాంజనేయులు గురువారం బైక్‌పై మచిలీపట్నం వస్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో పడిన సామ్రాజ్యంపై బైక్ పడటంతో గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు 108 ద్వారా గాయాల పాలైన ఇరువురిని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇరువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 11వ డివిజన్ భాస్కరపురంలో పూడికతీత పనులు గురువారం నిర్వహించారు. డివిజన్‌లోని దిమ్మల సెంటర్ నుంచి రాడార్ కేంద్రం రోడ్డులో ఉన్న డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఈ పనులను ఆ డివిజన్ జేఎస్పీ ఇంచార్జ్ బండి కమలాకర్ పర్యవేక్షించారు.

డ్రెయిన్ల పరిశీలన

అవనిగడ్డ: మండల పరిధిలోని మోదుమూడిలో పలు డ్రెయిన్లను కోడూరు డీసీ వైస్‌ఛైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఖరీఫ్‌లో డ్రెయిన్ల పూడికతీతకు చేపట్టాల్సిన చర్యలను ఆయన డ్రెయినేజీ ఏఈఈ అబ్దుల్ కరీంతో చర్చించారు. కార్యక్రమంలో రైతులు బచ్చు మల్లి, తోట చక్రధర్, బచ్చు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పాస్టర్ల సమావేశం



పామర్రు: క్రైస్తవ సంక్షేమమే లక్ష్యంగా సంఘ సభ్యులంతా పనిచేయాలని పామర్రు క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షులు రెవరెండ్ సాల్మన్ కొల్లాబత్తుల సూచించారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో గురువారం పామర్రు మండల పాస్టర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంఘటితంగా ఉన్నప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అప్పుడే క్రైస్తవుల సంక్షేమం అభివృద్ధి సాధ్య పడుతుందని పేర్కొన్నారు. క్రైస్తవులకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని, క్రైస్తవ విద్యార్థుకు ప్రత్యేక ఉపకార వేతనాలను అందజేయాలని కోరారు. అనంతరం పాస్టర్ కొండవీటి ప్రదీప్‌ను పాస్టర్లంతా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యవర్గసభ్యులు టీ షాలేంరాజు, జీ సత్యకుమార్, ఎం సామ్యూల్, వీ ఆదాములు, పీటీపీఎఫ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గూడు లేక గోడు మిగిలింది

- కూటమి ప్రభుత్వంలో 429 ఇళ్లు రద్దు..?
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెడన మండలంలో 3,761 ఇళ్లు మంజూరు



పల్లోటి లే అవుట్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించుకున్న గృహాలు

పెడన: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు సొంతింటి కల నేరవేర్చడానికి పెద్ద ఎత్తున కాలనీలను ఏర్పాటు చేసి ఇళ్లను కట్టిఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో పెడన మండలంలో 3,761 ఇళ్లను మంజూరు చేయగా ప్రస్తుతం వీటిలో 429 ఇళ్లను రద్దు చేసేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆయా కాలనీల్లో ఇళ్లు కట్టడానికి ఎటువంటి చర్యలు చేపట్టకుండా ఉన్న లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసింది.

పట్టణంలో 324, రూరల్‌లో 105 ఇళ్లు రద్దు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు పెడన మండల వ్యాప్తంగా 3,761 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని సొంత స్థలాలుండీ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన వారు 55 మంది ఉన్నారు. అలాగే 3,706 మందికి పట్టణంలో అర్హులైన వారికి సెంటు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి సెంటున్నర స్థలాలను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. కాగా నేడు రూరల్‌లో 105, పట్టణంలో 324 మంది ఇంటి స్థలాలను, ఇళ్ల మంజూరును రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. రద్దు అయ్యే లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి మేం ఇంటిని నిర్మించుకోలేమని, మాకు ఇచ్చిన స్థలాలను తిరిగి ఇచ్చేస్తున్నామనే విధంగా నిరభ్యంతర పత్రాలను తీసుకున్నారు.

ఇప్పుడు ఎంత ఇస్తారో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక ఇంటి నిర్మాణానికి రూ. 1.80లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైతే ఎంత ఇస్తారనే విషయంలో స్పష్టత లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో అయితే ఇంటి నిర్మాణానికి రూ. 4.50లక్షలు ఇస్తారని సోషల్ మీడియాలో న్యూస్ చక్కర్లు కొట్టింది. కానీ ప్రస్తుతం ఇస్తే రూ. 2.50లక్షలు లోపు ఉంటుందనే విషయాన్ని మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో అధికార పార్టీల నేతలు కొందరు చెబుతుండటం విశేషం.

నోటీసులు ఇచ్చాం..



గృహ నిర్మాణ శాఖ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి పని మొదలు పెట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చాం. వారి నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకున్నాం. ఈ నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాలి. పట్టణంలో 324, రూరల్‌లో 105 ఇళ్లను అస్సలు ప్రారంభించలేదు. కొత్తగా ఎవరైనా అర్హులుంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మాధవీలత,
ఏఈ, హౌసింగ్, పెడన పట్టణం

ఘంటసాల పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలి



ఐ లవ్ యూ ఘంటసాల బోర్డు ప్రారంభిస్తున్న ఎన్నారై రంగనాథబాబు దంపతులు

ఘంటసాల: ప్రముఖ శైవ, బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని గొర్రెపాటి విద్యాట్రస్టు అధినేత, ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు ఆకాంక్షించారు. ఘంటసాల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన గ్రామ చిహ్నాల ప్రాంగణంలో ఘంటసాల.నెట్ నిర్వాహకుల సూచన మేరకు గ్రామంలోని గొర్రెపాటి విద్యాట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ ఘంటసాల' బోర్డును గురువారం రంగనాథబాబు - ఇందిరా దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్నారై వేమూరి రాజేష్ మాట్లాడుతూ ఘంటసాల గ్రామ చిహ్నాలైన గాయకుడు వెంకటేశ్వరరావు, గౌతమ బుద్ధుడు, శ్రీ జలధీశ్వరస్వామి భారీ విగ్రహాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ యూ ఘంటసాల బోర్డు వద్ద ప్రతి ఒక్కరూ ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని తద్వార ఘంటసాల ఔన్నత్యాని చాటాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ గొర్రెపాటి రామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్త ఎస్.సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్ డ్రైవింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పాత రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు టైలరింగ్, యువకులకు కార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులని వివరించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీష్‌లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 93907 74782 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు కోరుతూ నోటీసులు

గుడివాడరూరల్: మండలంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు గురువారం కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్దకు వెళ్లి నిర్వాహకులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీలు, ఇతర వ్యవహారాలను నియంత్రించేందుకు ముందస్తుగానే అన్ని ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద ఆయా నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆలయ, చర్చిలు, మసీదుల నిర్వాహకులు పాల్గొన్నారు.

మినుము పంటపై మూషికాల దాడి

లబోదిబోమంటున్న రైతులు



ఎలుకలు పట్టేందుకు సిద్ధంగా ఉంచిన బుట్టలు

కృత్తివెన్ను: రెండవ పంటగా రైతులు సాగుచేస్తున్న మినుము పంటపై మూషికాలు దాడి చేసి రైతాంగాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో వారు ఎలుకల నివారణకుగానూ ఎలుక బుట్టలను ఆశ్రయిస్తున్నారు. ఒకవైపు దాళ్వా లేకపోవడంతో రైతులు నష్టపోయారు. పంటకు విరామం ఇవ్వడంతో రైతులు చేస్తున్న అపరాల సాగైన మినుము పంటపై ఎలుకల దాడి తీవ్రమైంది. దీని నివారణ రైతులకు తలకు మించిన భారంగా మారింది. దీంతో ఏంచేయాలో పాలుపోక రైతాంగం పురాతన సాంప్రదాయ పద్ధతిలో ఎలుకలను పట్టేందుకు ఎలుక బుట్టలను ఆశ్రయిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చిన ఎలుకబుట్టల వారితో వాటి నివారణకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది కూడా చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయిందని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 2,300 ఎకరాల్లో మినుము పంటను వేశారు. ఇప్పుడు ఎలుకల దాడితో పంట అంతా పాడైపోతోంది. దీంతో ఎలుకకు రూ. 20 ఇచ్చి వాటిని పట్టిస్తున్నారు. మినుము పంటకు ఏమాత్రం అనుకూలమైన భూములు కాకున్నా రైతులు ఏదో ఆశతో సాగు చేపడితే ఇప్పుడు ఎలుకలు, తెగుళ్ల లాంటి వైపరిత్యాలతో ఏంచేయాలో తెలియక లబోదిబోమంటున్నారు.

నిరుపయోగంగా వంతెన



నిత్యం భారీ వాహనాలకు పార్కింగ్‌గా మారిన వంతెన



మర్రిపాలెం-నాలి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు కనెక్టివిటి ఇవ్వకుండా వదిలేసిన దృశ్యం

- రూ. 45లక్షలతో నిర్మాణం
- ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మర్రిపాలెం(నాగాయలంక): తీర గ్రామాల ప్రధాన రహదారికి అనుసంధానంగా 2016లో రూ. 45లక్షల వ్యయంతో నిర్మితమైన నాగాయలంక ముఖద్వారం సమీపంలోని మర్రిపాలెం భారీ వంతెన ఇప్పటికీ వినియోగంలోకి రాకపోవడం సంబంధిత ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అలసత్వానికి ప్రత్యక్ష నిదర్శనంగా మిగిలింది. పర్యవసానంగా ఈ వంతెన ప్రైవేటు భారీ వాహనాలకు (లారీలు, స్కూల్ బస్సులు, ప్రొక్లెయిన్ వంటి) పార్కింగ్ స్థలంగా, భారీ ప్లెక్సీ హోర్డింగ్‌లకు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా వినియోగంలో ఉంది. ఈ వంతెనను నాలి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానించి వినియోగంలోకి తీసుకురావలసి ఉంది. కానీ అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖలు గాలికి వదిలేసాయి.

ఆధునికీకరణలో భాగంగా నిర్మాణం

పాత వంతెన శిథిలమైందన్న కారణంతో డెల్టా ఆధునికీకరణలో దాని పక్కనే నూతన వంతెన నిర్మించారు. కొత్తది కట్టి పాత వంతెన తొలగించకపోవడమే ఈ వంతెనపై అశ్రద్ధకు కారణమా అనేలా పరిస్థితి నెలకొంది. అలాంటప్పుడు డెల్టా ఆధునికీకరణ పనుల్లో ఎందుకు ఇంత మొత్తం (రూ. 45లక్షలు) వృధా చేసినట్టో అవగతం కావడం లేదని తీరప్రాంత ప్రజలు అంటున్నారు. కేవలం 200అడుగుల లోపు పైగా పొడవు అప్రోచ్ రోడ్డు నిర్మించక ఆయా శాఖలు గాలికి వదిలేయడమే విడ్డూరంగా ఉంది. మర్రిపాలెం-నాలి రోడ్డు (తీరగ్రామాల రోడ్డు)కు అనుసంధానం చేయకపోవడతో నేరుగా రాకపోకలు సాగించే వీలులేక శిథిలమైందని పక్కన పెట్టిన పాత వంతెననే వినియోగించడం గమనార్హం. దీంతో కొత్త వంతెన ప్రైవేటు వ్యక్తులకు పార్కింగ్ స్థావరంగా మారింది. ఇంకో పక్క ఈ వంతెన సెంటర్‌లో అటు దిగువ గ్రామాల రాకపోకలు, ఇటు నాగాయలంక-అవనిగడ్డ మెయిన్‌రోడ్డు రాకపోకలతో పలుసార్లు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాలి రోడ్డుకు వంతెనను తక్షణమే అనుసంధానించేలా చర్యలు చేపట్టి వంతెనకు విముక్తి కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయలోపం

డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా మర్రిపాలెం వంతెన నిర్మించిన విషయం వాస్తవమేనని.. ప్రపోజల్స్, నిబంధనల మేరకు వంతెన నిర్మాణ బాధ్యత వరకే ఇరిగేషన్ శాఖకు ఉందని ఆ శాఖ ఏఈఈ పొన్నూరు రవితేజ తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ వారు వంతెన అనుసంధాన అప్రోచ్ రోడ్డు ఎందుకు వేయలేదో తెలియదని, రోడ్డు వేసే బాధ్యత వారిదేనని ఆయన వివరణ ఇచ్చారు.

- ఆర్‌అండ్‌బీ అవనిగడ్డ డీఈఈ ఎం.రమేష్‌ను దీనిపై వివరణ కోరగా డెల్టా పనుల్లో వంతెన నిర్మించిన ఇరిగేషన్ శాఖ రోడ్డుకు కనెక్టివిటీ ఇవ్వకుండా ఇన్నేళ్లు ఎందుకు వదిలేసిందో తమకు తెలియదన్నారు. అసలు ఈ అప్రోచ్ రోడ్డు విషయమే ఇంత వరకు తనకు తెలియదని.. ఇప్పుడు మీరు మా దృష్టికి తెచ్చారు కాబట్టి ఏదైనా మరమ్మతుల సమయంలో ఈ అప్రోచ్ రోడ్డును పరిగణలోకి తీసుకుని కనెక్టివిటీ చేస్తామని డీఈఈ వివరించారు.

యానాదులకు ఆధార్ కార్డులు ఇవ్వాలి



శ్రీకాకుళంలో యానాదులతో యానాది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయబాబు

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం గ్రామంలో ఆధార్ కార్డు లేని 20 మంది యానాదులకు ఆధార్ కార్డులు ఇవ్వాలని యానాది మహానాడు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు పేర్కొన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో యానాది మహానాడు సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాదులకు ఆధార్ కార్డు, నివేశన స్థలాలు, రేషన్ కార్డులు, ఇతర సమస్యలపై చర్చించారు. అనంతరం విజయబాబు మాట్లాడుతూ శ్రీకాకుళం గ్రామంలోని సుమారు 20 మందికి ఆధార్ కార్డులు లేవని తెలుసుకుని కృష్ణాజిల్లా గిరిజన శాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడగా వచ్చే వారంలో వీరందరికి తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కార్డులు ఇచ్చే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆధార్ కార్డు లేకపోతే ప్రభుత్వ పథకాలు ఏ ఒక్కరికీ రావని రాష్ట్రంలో యానాదులకు ప్రధాన సమస్య ఆధార్ అని తెలిపారు. దీనిపై జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి ఆధార్ కార్డు లేని వారందరికీ ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఆధార్ ఇప్పించేందుకు కృషి చేస్తామని విజయబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, సంజీవమ్మ, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

నా సేవా కార్యక్రమాలకు నాంది పలికింది దివిసీమే

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



హర్యానా గవర్నర్ దత్తాత్రేయను సత్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కుటుంబ సభ్యులు

అవనిగడ్డ: తన సేవా కార్యక్రమాలకు దివిసీమలోనే నాంది పలికినట్టు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చండీగఢ్ రాజ్‌భవన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన సమయంలో తొలిసారి తాను సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. కాళ్లలో ముళ్లు గుచ్చుకుని పుండ్లు పడినా లెక్కచేయకుండా ఉప్పెన అనంతర సేవల్లో పాల్గొన్నట్టు తెలిపారు. ఉప్పెన వల్ల దెబ్బతిన్న గ్రామాలను పునరుద్ధరించడంలో ఆనాడు చేపట్టిన సేవా కార్యక్రమాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ, తనయుడు, కోడలు వెంకట్రామ్, సాయి సుప్రియ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఆనాటి గురువులతో 1995-96 పదో తరగతి ఏ సెక్షన్ పూర్వ విద్యార్థులు

పెడన: పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96వ సంవత్సరంలో పదో తరగతి చదివిన ఏ, బీ సెక్షన్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం జరిగింది. వీరంతా 30 సంవత్సరాల తర్వాత పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యను బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులైన రవీంద్రనాథ్‌ఠాగూర్, సల్మాన్‌రాజు, బొమ్ము గోవర్ధనరావు, సుభాషిణి, రామకృష్ణ, మణి తదితరులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. ఈ అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు కుర్మా సుధాకర్, పేరక నాగరాజు, గోరులక్ష్మీ నరసయ్య, యర్రా సాయిబాబు, మెట్ల మహేష్, రఫీ, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

పర్చూరి వంశస్థుల ఆత్మీయ కలయిక



కార్యక్రమానికి హాజరైన పర్చూరి వంశస్థులు

బందలాయిచెరువు(అవనిగడ్డ): మండల పరిధిలోని బందలాయిచెరువుకు చెందిన పర్చూరి రామస్వామి - రాధారుక్మిణి వంశస్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ దంపతులకు ఎనిమిది మంది మగ సంతానం కాగా వారికి పుట్టిన 80 సంతానం, వారికి పుట్టిన మనువళ్లు, మునిమనువళ్లు, మునిమనవరాళ్లు కలిసి మొత్తం 275 సంతానం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరి సంతానంలో ఒకరైన మాజీ సర్పంచ్ పర్చూరి సోమేశ్వరరావు తనయుడు, న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. దేశ విదేశాల నుంచి వారి వంశస్థులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంశస్థుల్లోని ఆడపిల్ల వారి సంతానం నుంచి మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు, ఆయన తనయుడు ప్రముఖ కేన్సర్‌వైద్య నిపుణుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి చంద్రశేఖర్, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఉన్నట్టు చెప్పారు. మాజీ జెడ్పీటీసీ పర్చూరి వెంకటనారాయణ, స్వాతంత్ర్య సమరయోధుడు పర్చూరి భైరాగితోపాటు మరెందరో ఉన్నత ఉద్యోగాలు, ఇతర దేశాల్లో స్థిరపడినట్టు పేర్కొన్నారు. పూర్వీకులకు నివాళులు అర్పించిన అనంతరం వారి జ్ఞాపకాలను నెమరేవసుకున్నారు.

పెందుర్రులో ముగ్గుల పోటీలు



బంటుమిల్లి: గ్రామస్థాయిలో యువత పెడదారి పట్టకుండా గ్రామీణ ఆటలను ప్రోత్సహించాలని సీపీఎం నాయకులు సూచించారు. మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలో సీపీఎం అనుబంధ రైతు సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆటల పోటీల ఆవశ్యకతను వివరించారు. అనంతరం వాలీబాల్ పోటీలో విజేతగా నిలిచిన పెందుర్రు జట్టుకు, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, ఎల్.అజయ్‌ఘోష్, పి.ధనశ్రీ, ఎల్.పద్మ, బి.శ్యాంసుందర్, పి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

- **వృద్ధురాలి నేత్రదానం**

కోడూరు: కోడూరుకు చెందిన గెల్లి లక్ష్మీనాంచారమ్మ బుధవారం రాత్రి వృద్ధాప్యంతో మృతిచెందింది. దీంతో లక్ష్మీనాంచారమ్మ నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యబృందం కోడూరు వచ్చి లక్ష్మీనాంచారమ్మ నేత్రాలను సేకరించారు. వాసవీ కపుల్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.